క్లుప్తంగా

ముక్కంటి సేవలో..



ఆలయంలో మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి వారిని శుక్రవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

21న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసులునాయక్

శ్రీకాళహస్తి: పట్టణంలోని కోర్టు ఆవరణలో ఈనెల 21వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ జరుగుతుందని 12వ అడిషనల్ జిల్లా న్యాయమూర్తి ఎం.శ్రీనివాసులు నాయక్ తెలిపారు. శుక్ర వారం కోర్టు భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ న్యాయ మూర్తి మాట్లాడుతూ రాజీ మార్గమే రాజ మార్గంగా లోక్ అదాలత్‌లో. దీర్ఘకాలిక కేసుల ను కక్షిదారులు పరిష్కరించుకోవాలని తద్వా రా సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్ తీర్పులకు అప్పీలు ఉండదని పేర్కొన్నారు. కక్షిదారులు న్యాయవాదులు, పోలీసు అధికారులు అధిక సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా చొరవ చూపాలని సూచించారు.

పోషణ కిట్ల పంపిణీ



ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ లలిత మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. నాణ్యమైన ఆకుకూరలు, కూరగాయలు, పప్పు దినుసులతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే రోగ నిరోధకశక్తి పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు చేసుకోవాలన్నారు. గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ముమ్మరంగా సామాజిక తనిఖీ



అంజిమేడులో సీసీ రోడ్డు పనులను తనిఖీ చేస్తున్న డీఆర్పీ వెంకటేశ్వరరావు

ఏర్పేడు: మండలంలో శుక్రవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీలు ముమ్మరంగా జరిగాయి. ఉపాధి హామీలో చేపట్టిన పంట, వరద కాల్వలు, నీటిగుంటలు, పండ్లు, పూలతోటలు, పంచాయతీ శాఖలో చేపట్టిన సీసీ రోడ్లు, గ్రామ సచివాలయాల భవన నిర్మాణాలు తదితర పనులను డీఆర్పీలు తనిఖీ చేశారు. పనుల వివరాలు, గుర్తించిన లోటుపాట్లను డీఆర్పీలు బహిరంగ సభలో వెల్లడిస్తారని ఎంపీడీఓ చెప్పారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శుక్రవారం పోస్ట్ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ప్రతాప్ జాదవ్, బాలీవుడ్ హీరో అనిల్ కపూర్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డు, ప్రసాదాలతో సత్కరించారు.

ఆర్థిక సాయం

ఏర్పేడు: మండలంలోని గోవిందవరానికి చెందిన కృష్ణమ్మ కుటుంబానికి వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. కృష్ణమ్మ(60) అనా రోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచ నల మేరకు కిషోర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, దహన సంస్కారాలకు రూ.10 వేలు నగదు ను అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. నాయకులు మునిరత్నం నాయుడు, కాట య్య, మహేష్ నాయుడు, శేఖర్ నాయుడు, మునికృష్ణ యాదవ్, మునేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలోని పొయ్య దళితవాడలో అనారోగ్యంతో మృతి చెందిన పెంచలయ్య(23) కుటుంబాన్ని శుక్రవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి సంతాపం తెలియజేశారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

సత్యవేడు: ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందుతోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. శుక్రవారం సత్యవేడు సచివాలయం- వన్‌లో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సందర్శించి ఎమ్మెల్యే బీపీ పరీక్షలు చేయించుకున్నారు. గ్రామస్తులతో వైద్య సేవలపై ఆరా తీశారు. శిబిరంలో పీహెచ్‌సీ వైద్యులతో పాటు ఇద్దరు స్పెషలిస్టులు సంధ్య(గైనకాలజిస్టు రుయా, తిరుపతి, డాక్టర్ ప్రవల్లిక(చిన్న పిల్లల నిపుణులు, తిరుపతి) సేవలందిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. వైద్యాధికారి గుణశేఖర్ మాట్లాడుతూ 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి 105 రకాల మందులు, జగనన్న కిట్టు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. విద్య, వైద్యం జగనన్నకు రెండు కళ్లని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ప్రజలు రూ.లక్షలు ఖర్చు వ్యయం చేసుకోకుండా ప్రభుత్వం వైద్య శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద 3,256 వ్యాధులకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో 12 మందికి కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వి.ప్రతిమ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, నాయకులు గురుప్రసాద్, ఆర్ షీలా, రాబర్ట్, పునిదకుమార్, మాణిక్యం, ఈశ్వరయ్య, చిన్నబ్బ, కృష్ణయ్య, శ్యాంప్రసాద్ రెడ్డి, రవిరెడ్డి, సురేంద్రరెడ్డి, శ్రీధర్, వంశీరెడ్డి, సన్యాసయ్య, శేఖర్, రూబెన్ ఎంఈఓలు కె. రవి, ఉషా తదితరులు పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు

కేవీబీపురం: మండలంలోని కోటమంగాపురంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 250 మంది వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. వైద్యసేవలు పొందారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. సర్పంచ్ తిరుపాల్‌యాదవ్, నందకుమార్, లాల్‌బాబుయాదవ్, ఎంపీడీవో రామచంద్ర, తహసీల్దార్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి రక్ష

రేణిగుంట: పేదల సంపూర్ణ ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం దోహదం చేస్తోందని ఆర్.మల్లవరం సర్పంచ్ ఆవుల మునివెంకట్రామిరెడ్డి(బాబ్జి) అన్నారు. మండలంలోని ఆర్.మల్లవరం సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక క్యాంపును సర్పంచ్ ప్రారంభించారు. మండల వైద్యాధికారి ఛత్రప్రకాష్‌రెడ్డి, వైద్య నిపుణులు ఎస్.వంశీప్రియ, బి.హేమావతి, సయ్యద్ జుబేర్ తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. సచివాలయ పరిధిలో మొత్తం 250మంది రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారిని ఆపరేషన్లకు సిఫార్సు చేశారు. కంటి అద్దాలు, హెల్త్ కార్డులను అందజేశారు. సీడీపీవో కృష్ణమంజరి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. డీఐఓ శాంతకుమారి, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరత్నమ్మ, పంచాయతీ కార్యదర్శి సుజాత, హరిపురుషోత్తం రెడ్డి, మహదేవరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, శ్రీహరిరెడ్డి, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సంతవేలూరు సచివాలయ పరిధిలోని ప్రజలకు స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారులు లావణ్య, మీనాక్షి, ద్వైత, హిమజ, ఉదయ్‌కుమార్ 409 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. మందులను అందజేశారు. కంటి వెలుగు కింద 16 మందికి కళ్లద్దాలు అందజేశారు. శిబిరం వద్ద పౌష్టికాహార ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. సర్పంచులు నందయ్య, చంద్రయ్య, వీరభద్రం, శ్రీధర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మణి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, తహసీల్దార్ గౌరీ శంకరరావు, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు మండలంలో..

పిచ్చాటూరు: మండలంలోని ముడియూరులో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష వైద్య శిబిరంలో 387 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గాయత్రితో పాటు స్పెషలిస్ట్ వైద్యులు అరుణ, పవిత్ర, జగదీష్ పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ శ్యామల, తహసీల్దారు మధుసూదన్ రావు, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ రాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కే.వెంకటచలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సర్పంచ్ కిరణ్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్ తొప్పయ్య, మాజీ వైస్ ఎంపీపీ పద్మనాభం, నాయకులు శంకర్ రెడ్డి, బాబు రెడ్డి, మోహన్, చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



సత్యవేడు: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజారోగ్యమే జగనన్న ధ్యేయం

శ్రీకాళహస్తి: ప్రజా ఆరోగ్యమే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె, వైఎస్సార్ సీపీ నేత పవిత్రారెడ్డి అన్నారు. మండలంలోని చల్లపాళెంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు. శిబిరానికి విచ్చేసిన పలు గ్రామాలకు చెందిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.









రేణిగుంట : వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, పిచ్చాటూరు : హెల్త్‌కార్డులను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, వరదయ్యపాళెం : మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది, వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

నెలకు సరిపడా మందులు ఇచ్చారు



వయస్సు పైబడడంతో గ్యాస్ట్రబుల్, షుగర్ ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రికి పోయేంత స్తోమత లేకపోవడంతో స్థానికంగా చిన్న చిన్న ఆస్పత్రులకు పోయినా అప్పటికప్పుడే తగ్గేటట్లు మాత్రలు, సూదులు వేసేవారు. జగనన్న సురక్షలో పరీక్షలు చేయించుకుంటే పెద్దాస్పత్రికి తీసుకుపోయి ఉచితంగా వైద్యం చేయిస్తామన్నారు. ప్రస్తుతానికి నెలకు సరిపడ మందులు ఫ్రీగా ఇచ్చారు. -మంగమ్మ, సంతవేలూరు

ఉచితంగా కళ్లద్దాలు ఇచ్చారు



ఇంతకు ముందు కంటి పరీక్షల కోసం తిరుపతికి వెళ్లి చూపించుకున్నా. కొద్దిరోజుల నుంచి సరిగా చూపు కనబడడం లేదు. వయస్సు మీద పడడంతో బయటకు వెళ్లలేక కాలం వెళ్లదీస్తున్నా. మా ఊరిలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్నా. అద్దాలు ఉచితంగా ఇచ్చారు. ఇప్పుడు చూపు బాగా కనిపిస్తోంది. పైసా ఖర్చు లేకుండా అద్దాలు ఇవ్వడం అభినందనీయం. -డి. నాగమ్మ, సంతవేలూరు

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



మా సొంతూరిలో వైద్యశిబిరం నిర్వహించడం సంతోషంగా ఉంది. డాక్టర్లు ఇక్కడకే వచ్చి వైద్య పరీక్షలు చేయడం అభినందనీయం. కండరాల నొప్పులతో బాధపడుతున్న నాకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలా గ్రామాలలో వైద్యశిబిరాలు నిర్వహించలేదు. ఇంటి వద్దకే వైద్య సౌకర్యాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. -బుజ్జమ్మ, సంతవేలూరు

ఉచితంగా ఆపరేషన్ చేస్తామన్నారు



మా ఊళ్లోనే జగనన్న సురక్ష వైద్య శిబిరం పెట్టి మాకు పరీక్షలు చేశారు. నాకు కంటి చూపు సరిగా లేకపోవడంతో చూపించుకున్నాను. పరీక్షించి కంటి అద్దాలు అందించారు. కంటి ఆపరేషన్ కూడా త్వరలోనే ప్రభుత్వమే ఉచితంగా చేయిస్తుందని వైద్యులు చెప్పారు. చాలా నాణ్యమైన వైద్యసేవలు అందిస్తుండడం సంతోషంగా ఉంది.
-టి.లక్ష్మి, కుమ్మరపల్లె, రేణిగుంట మండలం

భూ రీ సర్వే ఓ సువర్ణాధ్యాయం

- 355 మందికి కొత్త పాసు పుస్తకాల అందజేత
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



రీసర్వే పట్టా పాసు పుస్తకాలు అందుకున్న రైతులతో ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: భూముల రీసర్వేతో శాశ్వత హక్కులను కల్పిస్తూ రైతులకు పాసు పుస్తకాలను అందజేసి దేశానికే సీఎం జగనన్న ఆదర్శంగా నిలిచారని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సముదాయం సచివాలయంలో రైతులకు కొత్త పట్టాదార్ పాసు పుస్తకాలను అందజేశారు. సముదాయం గ్రామానికి చెందిన 355 మంది రైతుల భూములను రీ సర్వే చేయించి, హద్దులను ఏర్పాటు చేయడమే కాకుండా ఫీల్డ్ స్కెచ్‌లతో కొత్త పాసు పుస్తకాలను అందజేశారు. నియోజకవర్గంలోనే తొలిసారిగా రీసర్వే పూర్తి చేసి కొత్త పాసు పుస్తకాలను సొంత మండలం.. సొంత గ్రామానికి చెందిన రైతులకు అందజేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పొలాల హద్దులు మారడంతో రైతులు కోర్టులు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారం కాకుండా పడుతున్న ఇబ్బందులను జగనన్న గుర్తించారని అన్నారు. వివాదాలను పరిష్కరిస్తూ, రైతుల మధ్య స్నేహ బంధాలను ఏర్పరచాలని రీసర్వేకి శ్రీకారం చుట్టారని తెలిపారు. యజ్ఞంలా రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, సర్వేయర్లు భూములను రీసర్వే చేయిస్తున్నారని అన్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండ ఎవరి చుట్టూ తిరగకుండా భూములను సర్వే చేయించుకునే అవకాశాన్ని రైతులకు కల్పించడం ఓ సువర్ణ అధ్యాయమని పేర్కొన్నారు. తహసీల్దార్ ప్రమీల మాట్లాడుతూ మండలంలోని 16 రెవెన్యూ గ్రామాలుండగా, ఇప్పటికే 5 గ్రామాల్లో రీ సర్వే పూర్తి అయ్యిందని తెలిపారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సుదర్శనరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సారకాయలు, జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అర్ధనారీశ్వరస్వామి సేవలో ఎమ్మెల్యే దంపతులు



ఎమ్మెల్యే దంపతులకు ప్రసాదాలు అందిస్తున్న ఈఓ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీవాణీరెడ్డి దంపతులు వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణ శివారులోని అర్ధనారీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నంద మెడికల్స్ అధినేత నరసింహులు స్ట్రైచర్‌ను ఆలయానికి వితరణగా ఇచ్చారు. పలువురు వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురంలో నాభూమి-నాదేశం



దేశ నాయకుల చిత్రపటాలతో విద్యార్థులు

నాగలాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నాభూమి-నాదేశం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. దేశ భక్తి గీతాలను ఆలపించారు. మండల విద్యాశాఖాధికారి బాబయ్య, హెచ్‌ఎం కస్తూరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు మాతృ వియోగం



శకుంతల (ఫైల్)

పిచ్చాటూరు: వైఎస్సార్ సీపీ పిచ్చాటూరు మండల ఉపాధ్యక్షుడు వి.సుబ్రమణ్యం తల్లి శకుంతల(63) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి 8 గంటలకు మరణించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రాత్రి 9 గంటలకు పిచ్చాటూరులోని సుబ్రమణ్యం ఇంటికి వెళ్లారు. ఆమె మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు సుబ్రమణ్యం, ఆయన భార్య ఏఎంసీ డైరెక్టర్ నళినిని ఓదార్చారు. పార్టీ మండల అధ్యక్షుడు చలపతిరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు మోహన్ రెడ్డి, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇస్రోను సందర్శించిన విద్యార్థులు



ఇస్రో కేంద్రం వద్ద విద్యార్థులు

శ్రీకాళహస్తి: ఇస్రో అంతరిక్ష పరిశోధన కేంద్రం వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణానికి చెందిన ది స్కూల్ విద్యార్థులు షార్ సెంటర్‌ను సందర్శించారు. షార్ అధికారులు విద్యార్థులకు మిషన్ కంట్రోల్ లాంచింగ్ ప్యాడ్స్ 1, 2, మిషన్ కంట్రోల్ సిస్టమ్స్ పనితీరును వివరించారు. లాంచింగ్ వెహికల్ ఏ విధంగా ప్రయోగిస్తారు.. వీటిని కంప్యూటర్స్ ద్వారా ఎలా నియంత్రణ చేస్తారన్న విషయాలను వివరించారు. చంద్రయాన్, ఆదిత్య ఉపగ్రహాల ప్రయోగాల పనితీరుపై అవగాహన కల్పించారు. ది స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విశాల, విజ్ఞానశాస్త్రం ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పేరిట టోకరా

- బాధితుడి ఫిర్యాదుతో వెలుగు చూసిన మోసం

రేణిగుంట: రేణిగుంటలో ఉద్యోగాల పేరుతో టోకరా వేసిన ఆన్‌లైన్ కంపెనీ బండారం బయటపడింది. ఉద్యోగం ఆశతో నమ్మి మోసపోయిన ఓ బాధితుడు రేణిగుంట పోలీసులను ఆశ్రయించడంతో కంపెనీ సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. పోలీసుల కథనం మేరకు.. రేణిగుంట వినాయకనగర్‌లో ట్రంజ్ ఇండియా కార్పొరేట్ నెట్‌వర్క్ పేరుతో కొంత కాలం కిందట బ్రాంచ్‌ను ఏర్పాటు చేశారు. హెల్త్ ఉత్పత్తుల విక్రయం, ఆన్‌లైన్ బిజినెస్, కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు కల్పిస్తామంటూ సామాజిక మాధ్యమాల్లో తమ ఫోన్ నంబర్లను పెట్టి నడుపుతున్నారు. ఈ క్రమంలో కర్నూలుకు చెందిన లోకేష్ సదరు నంబరుకు ఫోన్ చేసి ఉద్యోగం కావాలని కోరాడు. అతని నుంచి రూ.650 కట్టించుకుని పేరు రిజిస్టర్ చేయించుకున్నారు. ఆ తర్వాత ఆన్‌లైన్ కంపెనీ లాగిన్, హెల్త్ ప్రోడక్ట్స్ కోసం మరో రూ.9వేలు కట్టించుకున్నారు. రోజు 30 మంది కాలర్స్‌తో మాట్లాడి వారు చెప్పిన వివరాలను తమకు తెలియజేయాలని.. కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగం, జీతం 18 వేలు అని నమ్మబలికారు. ఆగస్టు 25వ తేదీ లోకేష్ జాయిన్ అయ్యి వారు చెప్పిన విధంగా పని చేశాడు. కొద్ది రోజులకు చైన్ సిస్టమ్ తరహాలో మరికొంత మందిని చేరిస్తే వారు కట్టే మొత్తంలో కమిషన్ ఉంటుందని, ప్రత్యేకించి జీతం ఇవ్వమని చెప్పారు. దీంతో తాను కట్టిన రూ.9,650 తిరిగి ఇచ్చేయాలని కంపెనీ ప్రతినిధులను నిలదీశాడు. వారు నిరాకరించడంతో లోకేష్ శుక్రవారం రేణిగుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ సుబ్బారెడ్డి ట్రంజ్ ఇండియా రేణిగుంట బ్రాంచ్ సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసులు వివరించారు. పలువురు విద్యార్థి సంఘాల ప్రతినిధులు బాధితునికి అండగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఇలాంటి బోగస్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



రేణిగుంటలో నడుస్తున్న ట్రంజ్ ఇండియా బ్రాంచ్ కార్యాలయం





బాధితుడు లోకేష్‌తో విద్యార్థి సంఘాల నాయకులు, రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో కంపెనీ సిబ్బంది

తిరుమల పవిత్రత అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో ధర్మారెడ్డి

తిరుమల: శ్రీవారి ఆలయ పవిత్రత, విశిష్టతను కాపాడడం అందరి బాధ్యత అని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. నగరికి చెందిన ప్రకాష్ అనే భక్తుడు మాట్లాడుతూ తిరుమలలోని కొందరు మీడియా ప్రతినిధులు రాజకీయ నాయకులను రాజకీయ పరమైన ప్రశ్నలు అడుగుతున్నారని తెలిపారు. రాజకీయ నాయకులు ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంలో రాజకీయ విమర్శలు చేయడం బాధాకరమన్నారు. మీడియా ప్రతినిధులు రాజకీయ ప్రముఖులను వారి ఆధ్యాత్మిక అనుభూతులను గురించి ప్రశ్నలు వేస్తే బాగుంటుందని సూచించారు. తిరుమల పవిత్రతను కాపాడటంలో ప్రతి ఒక్కరూ టీటీడీకి సహకారం అందించాలని ఈవో కోరారు.

ప్రశ్న : తమిళనాడు నుంచి నడిచి వస్తున్న భక్తులకు బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేకంగా గ్యాలరీ, సౌకర్యాలు ఏర్పాటు చేయండి. – **ప్రకాష్, నగరి**

ఈవో : గ్యాలరీలలో ఎవరైనా కూర్చోవచ్చు.

ప్రశ్న : వైకుంఠ ఏకాదశి పర్వదినాలకు దర్శన టికెట్లు ఎప్పుడు విడుదల చేస్తారు.
– **శ్రీహరి, ప్రకాశం**

ఈవో : డిసెంబర్ 23 నుంచి 2024 జనవరి 1వ తేదీ వరకు 2 లక్షల వైకుంఠ ఏకాదశి దర్శన టికెట్లను త్వరలో ఆన్ లైన్‌లో విడుదల చేస్తాం. అదేవిధంగా 5 లక్షల టికెట్లు ఆఫ్‌లైన్‌లో ఇస్తాం.

ప్రశ్న : అంగప్రదక్షిణ టికెట్లు 3 నెలలు ముందుగా విడుదల చేస్తున్నారు. మహిళలకు ఇబ్బందిగా ఉంది, కావున ఆఫ్‌లైన్‌లో ఇవ్వండి. – **అనిత, చిత్తూరు**

ఈవో : అంగప్రదక్షిణ టికెట్ల కోటా పరిమితంగా ఉంటుంది. ఆఫ్‌లైన్‌లో ఎక్కువమంది క్యూలో వేచి ఉండడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. కావున ఆన్‌లైన్‌లోనే బుక్ చేసుకోండి.

ప్రశ్న : నిజపాద దర్శనం టికెట్ ఆన్‌లైన్ లక్కీడిప్‌లో ఇవ్వండి. – **పద్మావతి, తుని**

ఈవో : శుక్రవారం అభిషేకం, అలంకరణ కారణంగా నాలుగు గంటల సమయం పడుతోంది. భక్తులు దర్శనం కోసం అధిక సమయం వేచి ఉంటారు. నిజపాద దర్శనం కోసం మరికొంత సమయం కావాల్సి ఉంటుంది. దీంతో శుక్రవారం నిజపాద దర్శనాలను టీటీడీ బోర్డు రద్దు చేసింది.